# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతిని పురస్కరించుకుని ఆయనకు ప్రధానమంత్రి, ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు.**

2. **ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఉత్పత్తులకు ప్రచారం కల్పించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన అష్టలక్ష్మీ మహోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో ఈరోజు ప్రారంభిస్తారు.**

3. **ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ హబ్‌గా రూపొందుతోందని విశాఖపట్నంలో జరిగిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.**

4. **భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి తెలియజెప్పేందుకే కృష్ణవేణి సంగీత నీరాజనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కేంద్ర పర్యాటకశాఖ సహాయమంత్రి సురేష్ గోపీ తెలిపారు.**

5. **కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించిందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు.**

==========================

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్థంతి సందర్భంగా పార్లమెంటు ఆవరణలో మహాపరినిర్వాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తదితరులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. సమానత్వం, మానవ గౌరవం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన అవిశ్రాంత పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ప్రధానమంత్రి తెలిపారు. ఈరోజు ఆయన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన సంకల్పాన్ని నెరవేర్చేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని నరేంద్రమోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

--------------------------

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్థంతి సందర్భంగా విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాళులు అర్పించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ రాజ్యాంగ నిర్మాతకు ఘనంగా నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఇలావుండగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్

మహాపరినిర్వాణ్ దివస్ సందర్భంగా ఆకాశవాణి విజయవాడ కేంద్రం సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

---------------------------

ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, ఉత్పత్తులకు ప్రచారం కల్పించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన అష్టలక్ష్మీ మహోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని భారత మండపంలో ఈరోజు ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, పర్యాటక అవకాశాలు, ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలను సమష్టిగా అష్టలక్ష్మి అని పిలుస్తారు. ఈ కార్యక్రమంలో 250 మంది కళాకారులు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత, వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. అష్టలక్ష్మీ మహోత్సవం ఈశాన్య రాష్ట్రాల్లోని కళాకారులు, చేనేత కార్మికులు, పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలను సృష్టించి, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

---------------------------

దైనందిన జీవితంలో సాంకేతిక పరిజ్ఞానం ఒక భాగమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న డీప్‌టెక్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత వినియోగంతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఆహార ఉత్పత్తులు, సరఫరాకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారిందని అన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ..

వాయిస్ ( 47 సెకన్స్ )

---------------------------

భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి తెలియజెప్పేందుకే దేశంలో అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో విజయవాడలో 3 రోజుల పాటు జరిగే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ గోపి మాట్లాడుతూ..సంగీతాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. త్యాగరాజు, అన్నమయ్య వంటి అనేక మంది వాగ్గేయకారులు తెలుగు గడ్డపై జన్మించారని సురేశ్ గోపి వివరిస్తూ...

వాయిస్ ( 26 )

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మరుగున పడుతున్న కళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. త్వరలో నృత్య అకాడమీకి ఛైర్మన్‌ను నియమిస్తామని.. పద్య నాటకాలకు ప్రధాన వేదికలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ( 36 )

---------------------------

కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించింది. మూడు

రోజులుగా కొనసాగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ..ఎంపీసీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ ఈ రోజు ప్రకటించారు. రెపో రేటును యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి కూడా వడ్డీరేట్లలో మార్పులు చేయకూడదని నిర్ణయించామని ఆయన తెలిపారు. ఈసారి స్థిరవిధాన వైఖరిని కొనసాగించనున్నామని శక్తికాంత దాస్ స్పష్టంచేశారు.

--------------------------

హోంగార్డులు పోలీసులతో సమానంగా పనిచేస్తూ సేవలు అందిస్తున్నారని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కొనియాడారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు విజయవాడ ఏఆర్ మైదానంలో హోంగార్డ్స్ రైజింగ్ డే పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. పరేడ్‌లో పాల్గొన్న పోలీస్ కమిషనర్ హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ..

వాయిస్ ( 29 సెకన్స్ )

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డుల సేవలను పోలీసు ఉన్నతాధికారులు కొనియాడారు.

--------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి డి. శేషసాయి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 17 సెకన్లు....

--------------------------

శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని రైళ్లను ఏర్పాటు చేసింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతోన్న రైల్వే అధికారులు.. భక్తుల రద్దీ దృష్ట్యా తాజాగా మరో 28 సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు.

======================